సాక్షి
పశ్చిమగోదావరి
మంగళవారం । 16 । సెప్టెంబర్ । 2025



తప్పులతడకగా స్మార్ట్ కార్డులు

స్మార్ట్ రేషన్ కార్డులు తప్పులతడకగా తయారయ్యాయి. ప్రచారానికి ఇస్తున్న ప్రాధాన్యత ముద్రణ విషయంలో లేకపోవడంతో తప్పులు దొర్లుతున్నాయి. 8లో



గ్రావెల్ అక్రమ తవ్వకాలు

కొయ్యలగూడెం మండలం రాజవరం పంచాయతీ గంగవరంలో గత కొద్ది రోజులుగా గ్రావెల్ అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. 8లో



డ్వాక్రా సొమ్ము స్వాహా

ఆగిరిపల్లి మండలం సీతారామపురంలో ఏపీఎం దిడ్డి భార్గవి డ్వాక్రా సొమ్ము రూ.58 లక్షలు స్వాహా చేసింది. రికార్డుల పరిశీలనతో ఈ వ్యవహారం బయటపడింది. 8లో

న్యూస్‌రీల్

బాధితులకు భరోసా కల్పించాలి



భీమవరం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

భీమవరం: వివిధ సమస్యలతో పోలీస్ కార్యాలయాలకు వచ్చే బాధితులకు పోలీస్ శాఖ భరోసాగా ఉండాలని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. భీమవరం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు స్వీకరించిన సందర్భంగా పోలీసు స్టేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వచ్చిన అర్జీలు తిరిగి పునరావృతం గాకుండా పూర్తి స్థాయిలో విచారించి శాశ్వతంగా పరిష్కారం చూపాలని ఎస్పీ ఆదేశించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 9 మంది బాధితులు అర్జీలను అందచేశారు.

ఆధార్ కార్డులివ్వండి సారూ!



ఆధార్ కార్డుల కోసం ధర్నా చేస్తున్న ఎస్టీ కాలనీ వాసులు

నరసాపురం రూరల్: సీతారాంపురం సౌత్ ఎస్టీ కాలనీలో ఉంటున్న యానాదులకు ఆధార్ కార్డులు ఇవ్వాలని స్థానిక ఎస్టీ కాల నీవాసులు సోమవారం సచివాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ ఆధార్ కార్డు లేనివారు 19 మంది, అడ్రస్ మార్చాల్సిన వారు 12 మంది, ఇంటి పేర్లు మార్చాల్సిన వారు 15 మంది కలిపి మొత్తం 50 మంది వరకు ఉన్నారన్నారు. కార్డుల్లో అడ్రస్‌లు సక్రమంగా లేకపోవడం, పిల్లలకు కొత్త ఆధార్ కార్డులు లేకపోవడంతో అనేక సంక్షేమ పథకాలు అందడం లేదని తెలిపారు. యానాదుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం తగదని వారు అన్నారు. అనంతరం సచివాలయం కార్యదర్శి, వీఆర్వోలకు వినతిపత్రం అందజేశారు.

అర్జీల పరిష్కారంపై దృష్టిపెట్టాలి



పీజీఆర్ఎస్‌లో అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి

భీమవరం(ప్రకాశంచౌక్): పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారం పారదర్శకంగా, నాణ్యతతో ఉండాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి పీజీఆర్ఎస్‌లో ఆయన పాల్గొని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి అర్జీకి నాణ్యమైన పరిష్కారం ఉండాలన్నారు. ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అర్జీలు పరిష్కరించాలని ఆదేశించారు. ఫిర్యాదులు తమ పరిధిలోనివి కానప్పుడు వెంటనే సంబంధిత శాఖకు పంపాల న్నారు. ఈ సందర్భంగా దరఖాస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. యూరియా సమస్యపై రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ పిలుపు మేరకు కలెక్టరేట్ వద్ద సోమవారం కాంగ్రెస్ నాయకులు నిరసన తెలిపి జేసీకి వినతిపత్రం అందజేశారు. విభిన్న ప్రతిభావంతుల హక్కుల పరిరక్షణ చట్టం పూర్తి స్థాయిలో అమలు చేయాలని, పాత సదరం సర్టిఫికెట్లు కొనసాగించాలని కోరుతూ వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు.

ఉత్తమ సేవలు అందించాలి

ఏలూరు టౌన్: ఏలూరు రేంజ్ పరిధిలో ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించేలా పోలీస్ అధికారులు శ్రద్ధ వహించాలని.. శాంతిభద్రతల పరిరక్షణలో రాజీపడే ప్రసక్తే లేదని ప్రజలకు జవాబుదారీగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. జిల్లా ఎస్పీలుగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పోలీస్ అధికారులు ఐజీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. కృష్ణా జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు, బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఏలూరు రేంజ్ ఐజీని మర్యాదపూర్వకంగా కలిశారు.



అక్షరమే ఆయుధం

కేసులు పెట్టడం సరికాదు



ప్రజా సమస్యల పరిష్కారం కోసం వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చే పత్రికా రంగంపై కేసులు పెట్టే ధోరణి మంచిది కాదు. ప్రచురితమైన వార్తా కథనాల్లో ఏమైనా అవాస్తవాలు దొర్లితే న్యాయపరంగానో, ఇతర మార్గాల్లోనో సంప్రదించాలే తప్ప విలేకరులపై కేసులు నమోదుచేసే పరిస్థితులు తీసుకురాకూడదు. సమాజంలో పత్రికా స్వేచ్ఛకు గండి కొట్టేలా ఏ ప్రభుత్వం కూడా చర్యలు తీసుకోరాదు. నాలుగో స్తంభంగా ఉన్న పాత్రికేయ వ్యవస్థకు సమాజంలో జరుగుతున్న విషయాలను తెలిపే హక్కు ఉంటుంది.

– వంక రవీంద్రనాథ్, ఎమ్మెల్సీ

పత్రికా స్వేచ్ఛ అణచివేత



తమ వైఫల్యాలను ప్రశ్నించి, నిజాలు వెలికితీస్తున్న 'సాక్షి'పై కూటమి ప్రభుత్వం అక్కసు వెళ్లగక్కుతోంది. పత్రికా స్వేచ్ఛను హరిస్తూ, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ పాత్రికేయులపై కేసులు నమోదు చేయడం హేయమైన చర్య. పత్రికలపై కేసులు బనాయించడం దేశంలో ఎక్కడా చూడలేదు. ప్రజాస్వామ్యంలో వాక్ స్వాతంత్ర్యాన్ని పత్రికా స్వేచ్ఛను కూటమి ప్రభుత్వం దారుణంగా అణచివేస్తోంది. తక్షణమే సాక్షి యాజమాన్యం, పాత్రికేయులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలి.

– కవురు శ్రీనివాస్, ఎమ్మెల్సీ

ఇదే.. ప్రభుత్వ వైద్య కళాశాల

- రెండేళ్లు పూర్తిచేసుకున్న ఏలూరు మెడికల్ కాలేజీ
- వైఎస్ జగన్ హయాంలో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మాణం
- వైఎస్సార్‌సీపీ హయాంలో ఒక్క మెడికల్ కాలేజీ కట్టలేదంటూ బాబు అసత్య ప్రచారం
- వైద్య కళాశాలను సందర్శించి ఫొటోలు దిగిన అబ్బయ్యచౌదరి, జయప్రకాష్



ప్రభుత్వ మెడికల్ కాలేజీని చూపిస్తున్న మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఏలూరు సమన్వయకర్త ఎం.జయప్రకాష్, పార్టీ నాయకులు



ప్రభుత్వ మెడికల్ కాలేజీ తరగతి గదులో కొఠారు అబ్బయ్యచౌదరి, జయప్రకాష్ తదితరులు

ఏలూరు టౌన్ : 'ఇదిగో.. చంద్రబాబు గారూ... ఏలూరులో వైఎస్ జగన్ హయాంలో నిర్మించిన ప్రభుత్వ వైద్య కళాశాల భవనం.. కూటమి నేతలూ... చూశారా' అంటూ వైఎస్సార్‌సీపీ నేతలు ఆ భవనాల వద్ద సెల్ఫీలు దిగారు. ఏలూరు జిల్లాకే ప్రతిష్టాత్మకంగా.. జిల్లా ప్రజల చిరకాల కోరికను నెరవేర్చుతూ వైఎస్సార్‌సీపీ హయాంలో ఈ ప్రభుత్వ మెడికల్ కళాశాలను ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఒక్క మెడికల్ కాలేజీ కట్టలేదంటూ చంద్రబాబు అసత్య ప్రచారం చేస్తోన్న తరుణంలో వైఎస్సార్‌సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్ళపల్లి జయప్రకాష్, మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆధ్వర్యంలో పార్టీ నేతలు ఏలూరులోని మెడికల్ కాలేజీని సోమవారం సందర్శించారు. అత్యాధునిక సౌకర్యాలతో, కార్పొరేట్ తరహా లుక్‌తో మెరిసిపోతున్న వైద్య కళాశాల భవనాలను రాష్ట్ర ప్రజలకు చూపించే ప్రయత్నం చేశారు. 'మీ కళ్ళకు కనిపిస్తోందా?' అంటూ.. వీడియోలు, సెల్ఫీలు దిగారు. జోహార్ వైఎస్సార్.. జై జగన్ అంటూ నినాదాలు చేశారు. కూటమి నేతలు చేస్తున్నట్లు ఇది గ్రాఫిక్స్ కాదంటూ మెడికల్ కాలేజీ భవనం వద్ద ఫొటోలు తీశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఏలూరు నగర అధ్యక్షుడు గుడిదేశి శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకపెయ్యి సుధీర్‌బాబు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నెరుసు చిరంజీవి, ప్రధాన కార్యదర్శి లంకలపల్లి గణేష్, అధికార ప్రతినిధి మున్నుల జాన్‌గురునాథ్, ఎస్సీ సెల్ కార్యదర్శి ఇమ్మానుయేల్, నగర మహిళా అధ్యక్షురాలు జిజ్జువరపు విజయనిర్మల, ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు ఇనపనూరి జగదీష్, బీసీ సెల్ కార్యదర్శి కొల్లిపాక సురేష్, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు చిలకపాటి డింపుల్‌జాబ్ తదితరులు పాల్గొన్నారు.

300 మంది విద్యార్థులు చదువుతున్నారు: ప్రిన్సిపాల్

ఏలూరులో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో నిర్మించిన ప్రభుత్వ వైద్య కళాశాల భవనం ప్రారంభించి రెండేళ్లు పూర్తయ్యింది. 2023 సెప్టెంబర్ 2న ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం క్లాస్‌లు ప్రారంభించగా.. రెండేళ్లు పూర్తవడంతో వైఎస్సార్‌సీపీ నేతలు మెడికల్ కాలేజీ వద్ద కేక్ కట్ చేసి వేడుకలు చేసుకున్నారు. వైద్య విద్యార్థులకు, కాలేజీ ప్రొఫెసర్లు, నాన్ టీచింగ్ స్టాఫ్‌కు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. తొలుత కాలేజీలోని మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద నివాళులు అర్పించారు. కళాశాలలో అత్యాధునిక డిజిటల్ క్లాస్‌రూంలు, ల్యాబ్స్, టీచింగ్ రూమ్స్ పరిశీలించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సావిత్రిని మర్యాదపూర్వకంగా కలిసి కళాశాల నిర్వహణపై పలు అంశాలు అడిగి తెలుసుకున్నారు. 2023 సెప్టెంబర్ 2న 150 మంది ఎంబీబీఎస్ వైద్య విద్యార్థులతో క్లాస్‌లు ప్రారంభించారని, 2024లో మరో 150 మంది చేరారని, ప్రస్తుతం 300 మంది విద్యార్థులు చదువుతున్నారని చెప్పారు.

జగన్ చెప్పింది చేసి చూపిస్తారు

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెబితే చేసి చూపిస్తారు. గ్రాఫిక్స్ చేయడం మాకు చేతకాదు. 2022 నవంబర్‌లో మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు ప్రారంభించి 2023 సెప్టెంబర్ 2 నాటికే క్లాస్‌లు ప్రారంభించేలా పూర్తి చేసి చూపించారు. రూ.60 కోట్లతో అత్యాధునిక సౌకర్యాలు కల్పించి మెడికల్ కాలేజీని నిర్మించారు. రెండేళ్ళు పూర్తిచేసుకున్న సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలు చేసుకున్నాం. వైద్య విద్యార్థులు, మెడికల్ కాలేజీ స్టాఫ్‌కు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపాం. రాష్ట్రంలో 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీల ఏర్పాటుకు రూ.8500 కోట్లతో ప్రణాళిక రూపొందించి, తొలి దశలో ఐదు మెడికల్ కాలేజీలు ప్రారంభించారు.

– మామిళ్ళపల్లి జయప్రకాష్, ఏలూరు సమన్వయకర్త

ప్రైవేటు పరం చేయటం న్యాయమా?

వైఎస్సార్‌సీపీ హయాంలో ఒకేసారి 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు అనుమతులు తెచ్చిన గొప్ప నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి. విజయనగరం, రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల మెడికల్ కాలేజీలను అధికారంలో ఉండగానే ప్రారంభించగా.. ఎన్నికల నాటికి పాడేరు, పులివెందుల మెడికల్ కాలేజీలు పూర్తి చేశారు. కూటమి ప్రభుత్వం హయాంలో ఒక్క కొత్త భవనం నిర్మించారా?. జగన్ హయాంలో రైతు భరోసా కేంద్రాలు, సచివాలయ భవనాలు, విలేజ్ క్లీనిక్స్ నిర్మించారని, కూటమి నేతలు ఒక్క కొత్త భవనం నిర్మించారా? ప్రజలకు మంచి చేయటానికి ప్రయత్నం చేయాలి.

– కొఠారు అబ్బయ్య చౌదరి, మాజీ ఎమ్మెల్యే

మంత్రి సుభాష్ నోరు అదుపులో పెట్టుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కవురు శ్రీనివాస్

వీరవాసరం: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై లేనిపోని ఆరోపణలతో అవాకులు, చవాకులు పేలుతున్న కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్ నోరు అదుపులో పెట్టుకోవాలని ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ శెట్టిబలిజ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కవురు శ్రీనివాస్ తీవ్రంగా హెచ్చరించారు. వీరవాసరం మండలం నౌడూరు జంక్షన్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. శెట్టిబలిజ సర్టిఫికెట్ల విషయంలో రోజుకో మాట, పూటకో మాట మాట్లాడుతున్న మంత్రి సుభాష్‌కు మతిస్థిమితం తప్పిందన్న అనుమానం వస్తుందన్నారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసిన నేత ఎవరైనా ఉన్నారంటే అది ఒక్క వైఎస్ రాజశేఖర్ రెడ్డి మాత్రమే అన్నారు. అనంతరం ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్ని వర్గాల ప్రజలను అక్కున చేర్చుకొని బీసీ వర్గాలకు ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లతో పాటు నామినేటెడ్ పోస్టుల్లో సైతం పెద్ద ఎత్తున న్యాయం చేశారన్నారు. తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల్లో శెట్టిబలిజ సామాజిక వర్గం అత్యధికంగా ఉంటుందన్న ఉద్దేశ్యంతో అప్పటి వైఎస్సార్ హయాంలో ఎందరికో రాజకీయంగా ప్రోత్సాహాన్నిచ్చి ఎమ్మెల్యేలు, మంత్రులుగా చేశారన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలోనూ గ్రామాల్లోనూ ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి బీసీలను ఐక్యం చేసి బీసీ వర్గీయులంతా వైఎస్ఆర్‌సీపీకి అండగా ఉండేలా చైతన్యవంతం చేస్తామని వివరించారు. రాబోయే రోజుల్లో సుభాష్‌కు తగిన బుద్ధి చెప్పడం ఖాయమని హెచ్చరించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ బీసీ నాయకులు గూడూరి ఓంకారం, కోడె యుగంధర్, వీరవల్లి శ్రీనివాసరావు, కడలి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

యువ ఇంజనీర్ల పాత్ర కీలకం



డీఎన్నార్ కళాశాలలో విద్యార్థులకు బహుమతులు అందచేస్తున్న జేసీ

భీమవరం: సమాజ నిర్మాణంలో యువ ఇంజనీర్ల పాత్ర ఎంతో కీలకమని నిరంతరం కొత్త విషయాలను నేర్చుకుంటూ ముందుకు సాగాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం భీమవరం డీఎన్నార్ కళాశాలలో నిర్వహించిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. నేటి ఇంజనీరింగ్ రంగంలో జరుగుతున్న తాజా మార్పులు, సాంకేతిక ఆవిష్కరణల గురించి వివరించారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎం.అంజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిమ్మలపై ధిక్కార స్వరం

- మాజీ ఎమ్మెల్సీ అంగరకు జలవనరుల బోర్డులో డైరెక్టర్ పదవి
- తిరస్కరిస్తూ చంద్రబాబుకు అంగర లేఖ
- నియోజకవర్గంలో మరో నేత ఎదగకుండా నిమ్మల అడుగులు
- ఛైర్మన్ పదవిని ఆశించిన మరో ఇద్దరు నేతలకు డైరెక్టర్ పదవులతో చెక్
- నామినేట్ పదవులు వద్దని వారిద్దరూ బహిరంగంగా వెల్లడి

సాక్షి ప్రతినిధి, ఏలూరు: రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు పాలకొల్లు తెలుగు తమ్ముళ్లు ఝలక్ ఇచ్చారు. నియోజకవర్గంలో కేడర్ నుంచి లీడర్ వరకు తానేనంటూ.. తక్కువ పనితో ఎక్కువ పబ్లిసిటీతో నిత్యం ఫోకస్‌లో ఉండే మంత్రి తీరుపై తిరుగుబాటు జెండా ఎగురేస్తున్నారు. నియోజకవర్గంలో భవిష్యత్‌లో కూడా తనకు పోటీగా ఎవరూ ఉండకూడదని.. దానికనుగుణంగా వ్యూహాత్మకంగా అడుగులు వేస్తూ కీలక నామినేటెడ్ పదవులు తన నియోజకవర్గంలో దక్కకుండా తెరవెనుక చక్రం తిప్పుతున్నారు. తెరమీద పదవులు ఇవ్వాలి కాబట్టి డైరెక్టర్ పదవులతో మమా అనిపించడంతో తిరుగుబాటు మొదలైంది. పదేళ్లు మాజీ ఎమ్మెల్సీగా పనిచేసిన అంగర రామ్మోహనరావును జలవనరుల శాఖ బోర్డు డైరెక్టర్‌గా నియమించడంపై ఆయన తీవ్ర అసహనంతో ఉన్నారు. తాను పదవి తీసుకోలేనంటూ చంద్రబాబుకే లేఖ రాశారు. ఇదే రీతిలో నామినేటెడ్ పదవులు పొందిన మరో ఇద్దరు డైరెక్టర్లు కూడా తమకు ఈ పదవులు వద్దని బహిరంగంగా ప్రకటించడం టీడీపీలో హాట్ టాపిక్‌గా మారింది.



ANGARA RAMA MOHAN

తనకిచ్చిన డైరెక్టర్ పదవి వద్దంటూ ముఖ్యమంత్రికి మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహనరావు రాసిన లేఖ

పాలకొల్లు నియోజకవర్గంలో మంత్రి రామానాయుడు రాజకీయ ఎత్తుగడలకు టీడీపీ కేడర్ చెక్ పెడుతోంది. బీసీ సామాజిక వర్గంలో పట్టు ఉన్న అంగర రామ్మోహనరావు పార్టీ ఆవిర్భావం నుంచి తెలుగుదేశంలో పనిచేస్తున్నారు. ఎన్టీఆర్ హయాంలో పాలకొల్లు ఎంపీపీగా, ఉమ్మడి పశ్చిమగోదావరి జెడ్పీ వైస్ చైర్మన్‌గా పనిచేశారు. ఆ తరువాత చంద్రబాబు హయాంలో పాలకొల్లు ఎంపీపీగా, రెండు పర్యాయాలు మండలి సభ్యుడిగా ఉన్నారు. మండలి విప్‌గా, లెజిస్లేటివ్ లైబ్రరీ చైర్మన్‌గా పనిచేశారు. పార్టీ ఆదేశాల మేరకు పశ్చిమగోదావరి జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి అనేక కార్యక్రమాలు నిర్వహించానని రాష్ట్ర ఇరిగేషన్ బోర్డు సభ్యుడి పదవి తాను స్వీకరించలేకపోతున్నానని ముఖ్యమంత్రికి లేఖ రాయడం తీవ్ర కలకలం రేపింది. వాస్తవానికి అంగర ప్రభుత్వంలో కీలక పదవి లేదా రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవి ఆశించారు. పార్టీ అధిష్టానం కూడా ఆ మేరకు స్పష్టమైన హామీ ఇచ్చినట్లు సమాచారం. అదే నియోజకవర్గంలో మంత్రిగా నిమ్మల రామానాయుడు ఉన్నారు. రాజకీయంగా అంగర పాలకొల్లులో సీనియర్. అలాంటిది జూనియర్ నేత మంత్రిగా ఉన్న శాఖలో చైర్మన్ కాకుండా డైరెక్టర్ పదవితో అవమానించారనేది రామ్మోహనరావు ఆవేదన. దీంతో గత వారం లేఖ ద్వారా అసంతృప్తిని తెలియజేశారు.

అంగర బాటలో మరో ఇద్దరు

మొత్తంగా పాలకొల్లు నియోజకవర్గానికి ఇటీవల మూడు నామినేటెడ్ పదవులు దక్కాయి. విచిత్రమేమిటంటే ఒక్క రాష్ట్ర స్థాయి చైర్మన్ పదవి దక్కిన నేత ఈ నియోజకవర్గంలో లేకపోవడం గమనార్హం. పార్టీలో సీనియర్ నేతలు అనేక మంది ఉన్నా ఎంతటి ట్రాక్ రికార్డు ఉన్నా ఈ నియోజకవర్గంలో డైరెక్టర్ పదవే ఫైనల్. ఈ క్రమంలో ఇటీవల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పార్టీలో సీనియర్ నేతగా ఉన్న గొట్టుముక్కల సూర్యనారాయణరాజును నియమించారు. ఆయన కూడా ఈ పదవి అక్కర్లేదని తేల్చిచెప్పారు. టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి కడలి గోపాలరావు గతంలో జెడ్పీటీసీగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. పార్టీలో బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. రాష్ట్ర ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ డైరెక్టర్ పదవి కట్టబెట్టారు. గోపాలరావు తనకు ఈ పదవి వద్దంటూ సోషల్ మీడియావేదికగా ప్రకటించారు. మొత్తం మీద ముగ్గురు నేతలు మూడు డైరెక్టర్ల పదవులు తిరస్కరించడం టీడీపీలోనే తీవ్ర చర్చకు దారితీసింది. మంత్రి నిమ్మల వ్యవహారంపైన విస్తృతంగా చర్చ సాగుతోంది.

కలెక్టరేట్‌కు మార్కెట్ యార్డ్ అనువైన ప్రాంతం



భీమవరంలోని ఏఎంసీ ప్రాంతంలో కలెక్టరేట్‌కు కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న వామపక్ష నాయకులు

భీమవరం: భీమవరంలో కలెక్టరేట్ ఏర్పాటుకు వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంతమే అన్ని విధాలుగా అనువైందని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ నిర్మాణ సాధన కమిటీ ఆధ్వర్యంలో సీపీఐ, సీపీఎం, ఎంసీపీఐయు, ఫార్వర్డ్‌బ్లాక్, ప్రజాసంఘాల నాయకులు భీమవరంలో కలెక్టరేట్ ఏర్పాటుకు గత ప్రభుత్వం కేటాయించిన వ్యవసాయ మార్కెట్‌యార్డులోని స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గతంలో కలెక్టరేట్ నిర్మాణానికి 20 ఎకరాలు మార్కెట్‌యార్డు ప్రాంతంలో కేటాయించగా అక్కడ కొంతమేరకు గొడౌన్ నిర్మించినా ఎక్కువ భాగం ఖాళీగా గడ్డి, చెట్లతో ఉందన్నారు. కలెక్టరేట్ ఏర్పాటుకు గతంలో ఇచ్చిన జీవో ప్రకారం భవనాలు నిర్మించడం వల్ల జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు అనువుగా ఉంటుందన్నారు. ప్రజలకు రవాణా సౌకర్యాలు అందుబాటులో ఉన్న ప్రాంతం మార్కెట్ యార్డే తప్ప మరొకటి కాదని గోపాలన్ స్పష్టం చేశారు. సీపీఐ కార్యదర్శి చెల్లబోయిన రంగారావు మాట్లాడుతూ ప్రజలకు అనువైన ప్రాంతాన్ని కూటమి ప్రభుత్వం వచ్చాక రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. ఎంసీపీఐయు, ఫార్వర్డ్‌బ్లాక్ నాయకులు మహంకాళి, దండు శ్రీనివాసరాజు, సీపీఐ, సీపీఎం నాయకులు మల్లుల సీతారాంప్రసాద్, మల్లిపూడి ఆంజనేయులు, బొక్క సత్యనారాయణ పాల్గొన్నారు.

మహిళా కండక్టర్ ఆవేదన



వై.కుసుమకుమారి

జంగారెడ్డిగూడెం: ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న వై.కుసుమకుమారి మహిళలకు ఉచిత బస్సు పథకంపై స్పందిస్తూ చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తాము పడుతున్న ఇబ్బందులు, బాధలను వివరిస్తూ ఆర్టీసీ ఉన్నతాధికారులకు వీడియో పంపినట్టు ఆమె పేర్కొన్నారు. ఆ వీడియోలో ఏముందంటే.. 'ఆర్టీసీ ఉన్నతాధికారులకు మా మనవి.. మీకో వీడియో పెడుతున్నాను చూడండి. పరిమితికి మించి 150 నుంచి 170 మంది బస్సు ఎక్కుతున్నారు. చాలా రెక్‌లెస్‌గా ఉన్నారు. డోర్‌లో ప్రమాదకరంగా నిలబడుతున్నారు.. డోర్ వద్ద నిలబడొద్దు.. పైకి ఎక్కమంటే కండక్టర్‌పై ఎదురు తిరుగుతున్నారు.. ఉద్యోగాలు చేయలేకపోతున్నాం.. ఎందుకు సర్, మా ఉద్యోగాలతో, మా ఊపిరితో, మా కుటుంబాలతో ఇలా ఆడుకుంటున్నారు.. అధికారులకు మా సేవల పట్ల కనీస జాలి, దయ లేదు.. పారిశుధ్య కార్మికుల కన్నా హీనంగా తయారైంది మా ఉద్యోగం.. కిక్కిరిసిన జనాలతో మా ఊపిరి ఆర్టీసీ బస్సులోనే పోయేలా ఉంది.. బస్సులో కొట్టుకోవడం, కండక్టర్‌పై తిరగబడటం, గొర్రెలా అరుస్తున్నా పైకి ఎక్కకపోవడం, ఏంటండి ఇది మాకు.. మీరిచ్చే జీతాల కన్నా ఎక్కువ కష్టపడుతున్నాం.. అయినా సరే సరైన రక్షణ, మా సేవల పట్ల గుర్తింపు లేకుండా పోయింది..' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. మరి కండక్టర్ ఆవేదనపై ప్రభుత్వం, అధికారులు స్పందన ఎలా ఉంటుందనేది వేచిచూడాలి.

క్లుప్తంగా

రామిలేరులో గల్లంతైన యువతి మృతదేహం లభ్యం


నీరజ మృతదేహం

నూజివీడు: రామిలేరులో గల్లంతైన తుక్కులూరు దళితవాడకు చెందిన బడిపాటి నీరజ(20) మృతదేహం సోమవారం లభ్యమైంది. ఆదివారం చర్చికి వెళ్లి తిరిగి వస్తూ తుక్కులూరు, మర్రికుంటల మధ్యలో రామిలేరుపై ఉన్న లోలెవెల్ కాజ్‌వేను దాటుతూ వరద ఉద్ధృతిలో ఆమె కొట్టుకుపోయింది. ఈ నేపథ్యంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం రామిలేరు వాగులో సోమవారం ఉదయం గాలించగా ఘటన జరిగిన ప్రాంతానికి సమీపంలో మృతదేహం లభ్యమైంది. నూజివీడు ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం నీరజ మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. గాలింపు చర్యలను తహసీల్దార్ గుగులోతు బద్రూనాయక్ పర్యవేక్షించారు.

ట్రిపుల్ ఐటీలో 'ఇంజనీర్స్ డే'


మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు నివాళులర్పిస్తున్న ఏఓ లక్ష్మణరావు, ఫ్యాకల్టీ, విద్యార్థులు

నూజివీడు: నూజివీడు ట్రిపుల్ ఐటీలో సోమవారం ఇంజినీర్స్ డే ను నిర్వహించారు. దీనిలో భాగంగా సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఏఓ బీ లక్ష్మణరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ దేశ నిర్మాణంలో భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరాయ పాత్ర వెలకట్టలేనిదన్నారు. దేశంలోని అనేక నదులపై ఆనకట్టలు, వంతెనలు నిర్మించి నీటి పారుదల రంగంలో విశేష అభివృద్ధికి కారణమయ్యారన్నారు. దేశం గర్వించదగ్గ సుప్రసిద్ధ ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్యను స్ఫూర్తిగా తీసుకొని సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులు దేశ నిర్మాణంలో తమ వంతు పాత్ర పోషించాలన్నారు. అనంతరం సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో డీన్ అకడమిక్స్ సాదు చిరంజీవి, డీఎస్‌డబ్ల్యూఓ రాజేష్, సివిల్ హెచ్ఓడీ సునీల్‌భగత్, ఫ్యాకల్టీ పాల్గొన్నారు.


శ్రీవారి దేవస్థానం ఉద్యోగిపై వేటు

ద్వారకాతిరుమల: శ్రీవారి దేవస్థానంలోని లీజెస్ విభాగంలో అవకతవకలకు పాల్పడిన రికార్డ్ అసిస్టెంట్ అనుమంచిపల్లి సాయి రామానుజన్‌ను సస్పెండ్ చేస్తూ ఆలయ ఈఓ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ద్వారకాతిరుమల మండలంలోని దేవినేనివారిగూడెంకు చెందిన జూనుపూడి సిద్ధయ్య స్థానిక టీటీడీ కాంప్లెక్స్ లోని 11 వ నెంబర్ షాపును దేవస్థానం నుంచి బహిరంగ వేలం ద్వారా లీజుకు తీసుకుని, అందులో ఫొటో స్టూడియో నడుపుతున్నాడు. అద్దె సొమ్ము రూ.58 వేలు చెల్లించాల్సి ఉండగా, గతనెల 6న రూ.51 వేలను లీజెస్ విభాగం రికార్డ్ అసిస్టెంట్ రామానుజన్‌కు ఇచ్చాడు. అతడు దేవస్థానానికి మరుసటి రోజు రూ. 42 వేలను జమ చేసి, రూ.9 వేలను పక్కదారి పట్టించాడు. సిద్ధయ్యకు రసీదును కూడా ఇవ్వలేదు. లీజెస్ విభాగం ఏఈఓ ఐనంపూడి రమణరాజు షాపు నిర్వాహకుడు సిద్ధయ్యకు మూడు రోజుల క్రితం ఫోన్‌చేసి బ్యాలెన్స్ అద్దె డబ్బులు రూ. 16 వేలను వెంటనే చెల్లించాలని సూచించారు. తాను సాయి రామానుజన్‌కు రూ.51 వేలు చెల్లించానని, మరో రూ. 7 వేలు చెల్లిస్తే సరిపోతుందని చెప్పాడు. వెంటనే ఎమ్మార్‌లను పరిశీలించిన ఏఈఓ రమణరాజు పక్కదారి పట్టిన రూ.9 వేలను వెంటనే దేవస్థానానికి జమ చేయాలని ఉద్యోగిని హెచ్చరించారు. దాంతో సదరు ఉద్యోగి ఈనెల 14 న రూ.9 వేలను జమ చేశాడు. ఈ వ్యవహారం బయటకు పొక్కడంతో పాటు, సిద్ధయ్య సోమవారం ఫిర్యాదు చేయడంతో అధికారులు ప్రాథమిక విచారణ జరిపారు. ఉద్యోగి సాయి రామానుజన్‌పై సస్పెన్షన్ వేటు వేశారు.

తప్పుల తడకగా స్మార్ట్ రేషన్‌కార్డులు

ఆందోళనలో రేషన్ కార్డుదారులు

నూజివీడు: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా పంపిణీ చేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులు తప్పుల తడకగా తయారయ్యాయి. ప్రభుత్వం ప్రచారానికి ఇస్తున్న ప్రాధాన్యత స్మార్ట్‌కార్డుల ముద్రణ విషయంలో లేకపోవడంతో స్మార్ట్ రేషన్ కార్డుల్లో తప్పులు నమోదయ్యాయి. దీంతో కార్డుదారులు లబోదిబోమంటున్నారు. ఇంటి పేర్లు, ఇంటి నెంబర్లు, ఊరి పేర్లు తప్పుగా నమోదు కావడం, పాతకార్డులో ఉన్న వారి పేర్లన్నీ కొత్తగా జారీ చేసిన స్మార్ట్ రేషన్ కార్డులో లేకపోవడం వంటి తప్పులు ఎక్కువగా చోటు చేసుకున్నాయి. దీంతో వీటిని సరి చేయించుకోవడానికి కార్డుదారులు గ్రామ, వార్డు సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. తప్పుల తడకలుగా ఉన్న స్మార్ట్ రేషన్ కార్డులను చూసి ప్రభుత్వం కార్డుల ముద్రణ విషయంలో ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరించిందో అర్థమవుతోందని కార్డుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొందరి పేర్లు స్మార్ట్ రేషన్‌కార్డుపై లేకపోవడంతో రాబోయే రోజుల్లో పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి అర్హత లేకుండా పోతుందని ఆందోళన చెందుతున్నారు. నూజివీడు నియోజకవర్గంలో 170 రేషన్ దుకాణాల పరిధిలో 94,185 రేషన్‌కార్డులున్నాయి. వీటిల్లో నూజివీడు పట్టణంలో 13,648 కార్డులు, నూజివీడు మండలంలో 23,922 కార్డులు, ఆగిరిపల్లిలో 20,769 కార్డులు, ముసునూరు మండలంలో 18,515 కార్డులు, చాట్రాయి మండలంలో 17331 చొప్పున కార్డులున్నాయి. వీటిలో దాదాపు 25 నుంచి 30 శాతం కార్డుల్లో తప్పులు నమోదయ్యాయి.



ఎమ్మార్ అప్పారావు కాలనీకి బదులుగా శ్రీ అప్పారావు కాలనీగా నమోదు



మెతుకుమిల్లి పద్మావతి ఒక్కరి పేరునే ఇచ్చిన స్మార్ట్ రేషన్‌కార్డు

ఏకంగా కాలనీ పేరే తప్పుగా నమోదు

జిల్లాలోనే అతి పెద్ద కాలనీగా ఉన్న పట్టణంలోని ఎమ్మార్ అప్పారావు కాలనీ పేరునే తప్పుగా నమోదు చేశారు. ఎమ్మార్ అప్పారావు పేరులో ఎమ్మార్ లేకుండా శ్రీ అప్పారావు కాలనీగా స్మార్ట్ రేషన్ కార్డుల్లో నమోదైంది. ఇలా కాలనీ పేరునే మార్చేయడమేమిటో అర్థం కావడం లేదని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ కాలనీలో దాదాపు వెయ్యి కుటుంబాలకు చెందిన 5వేల మంది వరకు నివసిస్తున్నారు. తప్పుగా నమోదు కావడం వల్ల వీరందరి కార్డులపైన కాలనీ పేరును సరిచేయాల్సిన అవసరం నెలకొంది. పాత రావిచర్లలో మెతుకుపల్లి శ్రీనివాసరావు, అతని భార్య పద్మావతిలకు కలిపి స్మార్ట్ రేషన్‌కార్డు రావాల్సి ఉండగా కేవలం మెతుకుమిల్లి పద్మావతి ఒక్కరి పేరునే కార్డు రావడంతో ఆమె భర్త శ్రీనివాసరావు వారం రోజులుగా గ్రామ సచివాలయం, తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. తమ అర్జీని ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి రూ.80కు వరకు ఫీజు చెల్లించాల్సి వస్తోంది. తప్పుల సవరణను ఉచితంగా చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నా పేరును తొలగించారు



ఇటీవల ఇచ్చిన స్మార్ట్ రేషన్‌కార్డులో నా భార్య పేరు ఉంచి నా పేరును తొలగించారు. స్మార్ట్ రేషన్‌కార్డును తీసుకొని సరుకులు తెచ్చుకుందామని రేషన్ దుకాణానికి వెళ్లగా నీపేరు లేదు కదా, ఒక్కరికే సరుకులు వస్తాయని రేషన్ డీలరు చెప్పాడు. నా పేరును కార్డులో నుంచి ఎందుకు తీసేశారో తెలియడం లేదు.

– మెతుకుమిల్లి శ్రీనివాసరావు, పాతరావిచర్ల, నూజివీడు మండలం

కాలనీ పేరునే మార్చేశారు



నూతనంగా ఇచ్చిన స్మార్ట్ రేషన్ కార్డుల్లో పట్టణంలోని ఎమ్మార్ అప్పారావు కాలనీ పేరునే మార్చేశారు. ఎమ్మార్ అప్పారావు బదులుగా శ్రీ అప్పారావు అని ముద్రించారు. ఇలా తప్పుగా నమోదు చేయడంతో కార్డుదారులందరూ తప్పులను సరిచేయించుకోవాలి.

షేక్ మస్తాన్, ఎమ్మార్ అప్పారావు కాలనీ, నూజివీడు

స్కూల్ బస్ ఢీకొని కార్మికుడి మృతి


శ్రీనివాస్ మృతదేహం

పాలకొల్లు సెంట్రల్: పోడూరు మండలం పెనుమదం గ్రామం రోడ్డులో తూరల కంపెనీ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ కార్మికుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెనుమదం గ్రామానికి చెందిన కొబ్బరి కాయల ఒలుపు కార్మికుడు ఏలూరి శ్రీనివాస్ (48) సోమవారం తన ద్విచక్ర వాహనంపై తూరల కంపెనీ సమీపానికి పనిమీద వచ్చి వెళుతుండగా అదే రోడ్డులో పాలకొల్లు నుంచి వస్తున్న ప్రైవేట్ స్కూల్ బస్ శ్రీనివాస్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీనివాస్ కాలికి, తలకు తీవ్రగాయమవ్వడంతో స్థానికులు 108 ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బస్ సడన్ బ్రేక్ వేయడంతో బస్‌లో ఉన్న నలుగురు విద్యార్థులకు స్వల్ప గాయాలైనట్లు తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు నరసింహారావు ఫిర్యాదు మేరకు పోడూరు ఎస్సై సుధాకరరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

13 మందికి పదోన్నతులు

ఏలూరు (మెట్రో) : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో, జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఏవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు 13 మందికి పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులను చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ సోమవారం అందజేశారు. జెడ్పీ సీఈవో శ్రీహరి, ఏవో రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా గ్రావెల్ అక్రమ తవ్వకాలు


కొయ్యలగూడెం మండలం గంగవరం కొండ ప్రాంతంలో గ్రావెల్ తవ్వకాలు



బయ్యన్నగూడెంకి వెళుతున్న గ్రావెల్ లారీ

కొయ్యలగూడెం: రాజవరం పంచాయతీ గంగవరం గ్రామంలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు గత కొద్ది రోజులుగా యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. గంగవరం సమీపంలోని కొండ ప్రాంతమైన సర్వే నెంబర్ 205, 206, 207లలో సుమారు 20 ఏళ్ల క్రితం అప్పటి వైఎస్సార్ ప్రభుత్వం దళితులకు అరవై ఎకరాలకు పైగా సాగు భూమిగా కేటాయించి పట్టాలు అందజేశారు. వాటిలో రైతులు కొందరు జీడి మామిడి తోటలు వేయగా మరికొన్ని భూములు ఖాళీగా ఉన్నాయి. అటువంటి వాటిని గుర్తించి అక్రమార్కులు గ్రావెల్ తవ్వకాలు చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. రోజుకు 40 నుంచి 60 ట్రిప్పుల గ్రావెల్ మట్టి ట్రక్కుల ద్వారా సుదూర ప్రాంతాలకు రవాణా అవుతోందని ఇందులో అన్ని రాజకీయ పార్టీల నాయకుల భాగస్వామ్యం ఉందని ప్రజలు పేర్కొంటున్నారు. కొద్ది నెలల క్రితం డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఇదే ప్రాంతంలో కొనసాగుతున్న అక్రమ గ్రావెల్ తవ్వకాలను స్వయంగా చూడడం జరిగిందన్నారు. గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణానికి సేకరిస్తున్న గ్రావెల్ మట్టిపై విచారణ చేసి అక్రమ తవ్వకాలపై తనకు నివేదిక ఇవ్వాల్సిందిగా అధికారులను ఆదేశించారు. తిరిగి అదే కొండ ప్రాంతంలో ఇప్పుడు భారీ ఎత్తున గ్రావెల్ అక్రమ తవ్వకాలు కొనసాగుతుండడంపై ప్రభుత్వం ఏ విధంగా స్పందిస్తుందో వేచి చూడాలి. కాగా అక్రమ గ్రావెల్ తవ్వకాల విషయాన్ని తహసీల్దార్ ఎన్.నాగరాజు దృష్టికి తీసుకువెళ్లగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.


వడ్లమానులోని సూది గట్టువద్ద గ్రావెల్ తవ్వకాలు జరిగిన ప్రదేశం

సూదిగట్టు తవ్వేస్తున్నారు

ఆగిరిపల్లి: కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటినుంచి మండలంలోని సహజ వనరులను దర్జాగా దోచుకుంటున్నారు. రాత్రి అయితే చాలు మండలంలో కొండలను, గుట్టలను, అడిగే వారు లేకపోవడంతో అడ్డగోలుగా తవ్వేస్తున్నారు. వడ్లమానులో సూది గట్టు వద్ద ఆదివారం అర్ధరాత్రి అక్రమంగా తవ్వకాలు జరిపి గ్రావెల్‌ను తరలించిపోతుండగా గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. వారు వచ్చి కనీసం ఎటువంటి కేసులు నమోదు చేయకుండా వెళ్లిపోయారు. ఆ తర్వాత యథావిధిగా గ్రావెల్ తవ్వకాలు జరిగాయి. అమ్మవారి గూడెం గ్రామంలోని మాల గట్టు, ఈదులగూడెం, నరసింగపాలెంలో కూడా గ్రావెల్ మాఫియా అడ్డగోలుగా తవ్వేస్తున్నారు. ఇంత జరుగుతున్న అధికారులు మాత్రం తమకేమీ సంబంధం లేనట్టుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సహజ వనరులైన మట్టి, గ్రావెల్‌ను అక్రమార్కులు తరలించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అథ్లెటిక్స్ జిల్లా జట్ల ఎంపిక

తణుకు అర్బన్: పశ్చిమ గోదావరి జిల్లా అండర్ 14, 16, 18, 20 బాలుర, బాలికల జిల్లా జట్ల ఎంపికలు తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో సోమవారం నిర్వహించినట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంకు సూర్యనారాయణ తెలిపారు. ఎంపికైన జట్లలోని క్రీడాకారులు ఈ నెల 27 నుంచి 29వ తేదీల్లో ఏలూరులో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ఈ ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి 200 మంది క్రీడాకారులు హాజరుకాగా వీరిలో ప్రతిభ కనబరచిన 42 మందిని ఎంపిక చేసినట్లు చెప్పారు. అసోసియేషన్ చైర్మన్ మానేపల్లి శ్రీనివాస్ క్రీడాకారులకు భోజన వసతి కల్పించి సర్టిఫికెట్లు, మెడల్స్ అందచేశారు. హెచ్‌ఎం కె.పద్మావతి, అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ సత్యనారాయణ, కోశాధికారి కె.బాబురావు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా అథ్లెటిక్స్ జట్ల ఎంపిక

ఏలూరు రూరల్: ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో సోమవారం జిల్లా అథ్లెటిక్స్ జట్ల ఎంపిక పోటీలు ఉత్సాహంగా జరిగాయి. అండర్–14, 16, 18, 20 విభాగంలో బాలబాలికలకు వేరువేరుగా ఎంపిక పోటీలు చేపట్టారు. రన్నింగ్, షాట్‌పుట్, జావలిన్, డిస్కస్, హేమర్‌త్రో పాటు హైజంప్, లాంగ్‌జంప్ అంశాల్లో అథ్లెట్లు నువ్వా నేనా అన్నట్టు పోటీ పడ్డారు. సుమారు 250 మంది బాలబాలికలు పోటీలకు హాజరయ్యారని అసోసియేషన్ కార్యదర్శి ప్రసాద్ చెప్పారు. ఎంపికైన అథ్లెట్లు ఈ నెల 26వ తేదీ నుంచి 29 వరకూ ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో జరిగే అంతర జిల్లాల పోటీల్లో పాల్గొంటారని వివరించారు.


రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన జిల్లా జట్టు

కాలువలో బాలుడి గల్లంతు

పాలకోడేరు: వేంద్ర అగ్రహారం శివారు కట్టావారి పాలెంలోని గోస్తని డ్రెయిన్‌లో ఆదివారం సాయంత్రం ప్రమాదవశాత్తూ ఓ బాలుడు పడి గల్లంతయ్యాడు. గ్రామానికి చెందిన బొక్కా శ్రీనివాస్‌రావు రెండవ కుమారుడు జైదేవ్ (7) నౌడూరులోని ప్రైవేట్ స్కూల్‌లో ఒకటవ తరగతి చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో మరో బాలుడు చరణ్‌తో కలిసి సైకిల్ తొక్కుకుంటూ గ్రామంలోని గోస్తని డ్రెయిన్‌పై ఉన్న బ్రిడ్జి పైకి వెళ్లారు. ప్రమాదవశాత్తు బ్రిడ్జిపై నుంచి బాలుడు జైదేవ్ కాలువలోకి పడిపోయాడు. సమాచారం అందిన వెంటనే పోలీసులు, ఫైర్ అధికారులు గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించలేదు. సోమవారం కాకినాడ నుంచి ఏపీఎస్‌డీఆర్‌ఎఫ్ బలగాలు వచ్చి గాలిస్తున్నారు. జై దేవ్ తండ్రి శ్రీనివాస్ రావు లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. బాలుడి ఆచూకీ లభించకపోవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.


కాలువలో గల్లంతైన బాలుడు జయదేవ్

విద్యుత్ మోటార్లు, కేబుల్ వైర్ల దొంగల అరెస్టు

నూజివీడు: రైతుల పొలాల్లో విద్యుత్ మోటార్లు, కరెంటు తీగలను దొంగతనం చేసే ఇద్దరు దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. నూజివీడు సీఐ కొప్పిశెట్టి రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చాట్రాయి మండలంలోని పలు గ్రామాల పరిధిలోని పంట పొలాల్లోని వ్యవసాయ మోటార్లు, కరెంటు తీగలు ఇటీవల చోరీకి గురవుతున్నాయి. దీంతో రైతులు చాట్రాయి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై డీ రామకృష్ణ దర్యాప్తు చేపట్టారు. దీనిలో భాగంగా ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా చాట్రాయి మండలం తుమ్మగూడెంకు చెందిన యర్రా నాగవాసు, మాదాల భవానీశంకర్‌లను నిందితులుగా గుర్తించారు. వారిని సోమవారం తుమ్మగూడెం శివారు ఎన్నెస్పీ కాలువ వద్ద అరెస్టు చేసి, వారి నుంచి మూడు విద్యుత్ మోటార్లు, ఒక పంపు సెట్, 900 అడుగుల విద్యుత్ తీగను స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని సీఐ తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో కృషి చేసిన ఎస్సై డీ రామకృష్ణతో పాటు హెడ్‌కానిస్టేబుల్ జీ శ్రీనివాసరావు, కానిస్టేబుళ్లు కే మునీంద్రరావు, పీ వెంకటేశ్వరరావులను సీఐ అభినందించారు.


వివరాలు వెల్లడిస్తున్న సీఐ కె.రామకృష్ణ

డ్వాక్రా సొమ్ము రూ.58 లక్షలు స్వాహా

ఆగిరిపల్లి: డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులు అక్రమార్కుల చేతిలో మోసపోవడం పరిపాటిగా మారింది. ఆగిరిపల్లి మండలం సీతారామపురంలో వీవోఏగా పనిచేస్తున్న దిడ్డి భార్గవి డ్వాక్రా మహిళల సొమ్ము ఏకంగా రూ.58 లక్షలు స్వాహా చేసింది. ఏపీఎం రికార్డుల పరిశీలనతో ఈ వ్యవహారం బయటపడింది. వివరాల ప్రకారం దిడ్డి భార్గవి 12 ఏళ్లుగా వీవోఏగా విధులు నిర్వహిస్తోంది. ఆమె పరిధిలో 38 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి.వీరి ఖాతాలు ఈదర గ్రామంలోని ఇండియన్ బ్యాంకులో ఉన్నాయి. గ్రామానికి బ్యాంకు దూరంగా ఉండటం, నిరక్షరాస్యులైన మహిళల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని మహిళలు బ్యాంకుకు చెల్లించాల్సిన డ్వాక్రా రుణాలను తానే చెల్లిస్తానని నమ్మించి కొన్ని నెలలు సజావుగానే చెల్లించింది. గత కొన్ని నెలలుగా సుమారు 28 స్వయం సహాయక సంఘాల్లో ఒక నెల సభ్యులు బ్యాంకుకు వెళ్లి చెల్లిస్తుండగా, మరో నెల భార్గవికి ఇస్తున్నారు. ఆమె బ్యాంకులో చెల్లిస్తున్నానని నమ్మించి సొమ్ములు కట్టడం లేదు. ఇటీవల బదిలీపై వచ్చిన ఏపీఎం రాజశేఖర్ స్వయం సహాయక సంఘాల రికార్డులను పరిశీలించడంతో ఈమె వ్యవహారం బయటపడింది. డీఆర్‌డీఏ డీపీఎంలు విజయ్ కుమారి, ఎంఎస్‌డీ భూషణం నిధుల స్వాహాపై సోమవారం గ్రామంలో బహిరంగ విచారణ చేపట్టారు. విచారణలో రూ.58 లక్షలు అక్రమాలకు పాల్పడినట్లు అధికారులు గుర్తించారు. వీవోఏ భార్గవి డబ్బులు వెంటనే చెల్లించాలని మహిళలు నిరసన వ్యక్తం చేశారు. తనకు రెండు నెలల సమయం ఇస్తే ఆ డబ్బులు చెల్లిస్తానని భార్గవి అధికారులను కోరింది. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ అధికారులు మాట్లాడుతూ వీవోఏ అవినీతికి పాల్పడినట్లు గుర్తించామని, ఉన్నతాధికారులకు నివేదిక పంపిన తర్వాత తదుపరి విషయాలు తెలియజేస్తామన్నారు. స్త్రీ నిధి ఏజీఎం చెన్నకేశవులు, సర్పంచ్ అత్తి మురళి, ఏపీఎం డి.రాజశేఖర్, సీసీ దివ్య పాల్గొన్నారు.


సీతారాంపురంలో అధికారుల ప్రాథమిక విచారణ

శివయ్య ఆలయాన్ని ముంచెత్తిన గంగమ్మ


తిరుమలంపాలెంలోని శివాలయం ఆవరణలోకి చేరిన వర్షపు నీరు

ద్వారకాతిరుమల: తిరుమలంపాలెంలో శ్రీ భ్రమరాంబ ఆది మల్లేశ్వర స్వామి ఆలయాన్ని గంగమ్మ ముంచెత్తింది. సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం కారణంగా ఆలయ ఆవరణలోకి, అలాగే శివయ్య, అమ్మవారి గర్భాలయాల్లోకి భారీగా నీరు చేరింది. పురోహితుడు ఆ నీటిలోంచే స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంతం లోతట్టుగా ఉండటం వల్ల వర్షపు నీరు ఆలయంలోకి చేరుతోందని, ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉద్ధృతంగా గోదావరి వరద

పోలవరం రూరల్: గోదావరి వరద ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు నదిలో నీటి ప్రవాహం పెరుగుతుండటంతో వరద ఉద్ధృతి పెరిగింది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద 31.200 మీటర్లకు నీటిమట్టం చేరుకుంది. స్పిల్‌వే 48 గేట్ల నుంచి సుమారు 7 లక్షల క్యూసెక్కుల వరద నీరు దిగువకు చేరుతోంది. ఎగువన భద్రాచలం వద్ద 39.70 అడుగులకు నీటిమట్టం చేరుకుంది. అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు నదిలోకి నీరు చేరడంతో వరద మరో రెండు రోజులు పెరిగే పరిస్థితి ఉందని జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు.

కూటమిలో కుంపటి

- ప్రమాణ స్వీకార ఆహ్వాన పత్రికలో ఫొటో లేదని జనసేనలో అసంతృప్తి
- టీడీపీ ఎంపీపీ పేరు లేకపోవడంపైనా చర్చ

సాక్షి, భీమవరం: భీమవరం ఏఎంసీ పాలకవర్గ ప్రమాణస్వీకారం ఆహ్వానపత్రిక కూటమిలో కుంపటి రాజేస్తోంది. తమ నేతలకు ఆహ్వానపత్రికలో సముచిత స్థానం కల్పించలేదన్న అసంతృప్తిలో జనసేన పార్టీ కేడర్ ఉన్నారు. ప్రధాన మిత్రపక్షం తీరును అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లే యోచనలో వారున్నట్టు సమాచారం.

భీమవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకారం నేడు భీమవరంలోని మార్కెట్ యార్డులో జరుగనుంది. కూటమి ప్రజాప్రతినిధులు, మిత్రపక్షాల నేతలు, అతిథులను ప్రమాణ స్వీకార కార్యక్రమానికి స్వాగతిస్తూ ముద్రించిన ఆహ్వాన పత్రికలో భీమవరం నియోజకవర్గం నుంచి జనసేన ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి ఫొటోలను ముద్రించారు. ఆహ్వానపత్రికలో జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, భీమవరం మున్సిపల్ మాజీ చైర్మన్ కొటికలపూడి గోవిందరావు (చినబాబు) ఫొటో వేయకుండా పేరుతో సరిపెట్టారని ఆయన అనుచరవర్గం అసంతృప్తితో ఉన్నారు. కష్టకాలంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షునిగా పార్టీని ముందుడి నడిపించిన చినబాబుకు తగిన ప్రాధాన్యత దక్కడం లేదన్న భావనలో వారున్నట్టు సమాచారం. జనసేన నుంచి నియోజకవర్గంలో ఏకైక జెడ్పీటీసీగా ఉన్న వీరవాసరం జెడ్పీటీసీ గుండా జయప్రకాష్‌నాయుడు పేరు లేదంటున్నారు. రెండురోజులుగా జనసేన పార్టీ భీమవరం టౌన్, రూరల్, వీరవాసరం మండల నేతలు అంతర్గత సమావేశాలు ఏర్పాటుచేసుకుని ఈ విషయమై చర్చించినట్టు ప్రచారం జరుగుతోంది. కొందరు టీడీపీ నేతలు ఆహ్వానపత్రిక నుంచి అన్ని ఏర్పాట్లలోనూ వారే పెత్తనం చెలాయిస్తున్నారని, విషయాన్ని పార్టీ పెద్దల దృష్టికి తీసుకువెళ్లాలని నిర్ణయించారు. మిత్రపక్షాలతో అంటీముట్టనట్టుగా కార్యక్రమానికి హాజరుకావాలంటున్న వారు కొందరైతే.. గైర్హాజరయితేనే సమస్య అధిష్టానం దృష్టికి వెళుతుందని మరికొందరు భావిస్తున్నారు. విషయం బయటకురావడంతో కార్యక్రమం సాఫీగా సాగేలా బుజ్జగింపు ప్రయత్నాలు జరుగుతున్నట్టు తెలిసింది.

టీడీపీలోనూ అసమ్మతి

ఇదిలాఉండగా జిల్లాలోని వివిధ హోదాల్లో ఉన్న పలువురు టీడీపీ నేతల పేర్లను ముద్రించి నియోజకవర్గంలో భాగమైన వీరవాసరం మండలం టీడీపీకి చెందిన ఎంపీపీ వీరవల్లి దుర్గాభవాని పేరులేకపోవడం చర్చనీయాంశంగా మారింది. కార్యక్రమానికి రావాల్సిందిగా నేరుగా ఆహ్వానపత్రం అందించకుండా ఫోన్‌లోనే సమాచారం తెలియజేసినట్టు ఆమె వర్గీయులు అంటున్నారు. ప్రమాణస్వీకారానికి దూరంగా ఉండాలన్న యోచనలో వారున్నట్టు తెలిసింది.

కుమారుడి మరణం జీర్ణించుకోలేక తల్లి మృతి


చక్రపు వాసు(కుమారుడు)


శాంతమ్మ (తల్లి)

చింతలపూడి: కుమారుడి మరణాన్ని జీర్ణించుకోలేని ఓ తల్లి మృతి చెందిన ఘటన గురుభట్లగూడెం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చక్రపు వాసు (65) గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆదివారం వాసు తీవ్ర అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో కుమారుడు మరణించడం తెలుసుకున్న వాసు తల్లి శాంతమ్మ(90) తీవ్ర మనోవేదనకు గురైంది. తన కళ్లముందే కుమారుడు మృతి చెందిన విషాదాన్ని జీర్ణించుకోలేక సోమవారం శాంతమ్మ కూడా తనువు చాలించింది. రెండు రోజుల వ్యవధిలో ఒకే కుటుంబంలోని తల్లి, కుమారుడు మృతి చెందడంతో గురుభట్లగూడెంలో విషాద ఛాయలు నెలకొన్నాయి.

క్లుప్తంగా

నేడు టూ టౌన్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎస్ఎస్ యాగర్లపల్లి సబ్‌స్టేషన్‌కు పరిధిలో స్థానిక టూ టౌన్‌లోని పలు ప్రాంతాలలో విద్యుత్ పోల్స్, విద్యుత్ వైర్లు ఏర్పాటు, మరమ్మతుల నిమిత్తం పడాల, పడాల గరువు, ముత్యాలంభపురం, కొబ్బరితోట, యాగర్లపల్లి పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ కె.నరసింహమూర్తి వెల్లడించారు. ఈ నెల 16వ తేదీ మంగళవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నడకతోనే సంపూర్ణ ఆరోగ్యం


పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళా వాకర్స్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): నడకతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎయిర్‌స్ట్రిప్ మహిళా వాకర్స్ అధ్యక్షురాలు వనచర్ల విజయలక్ష్మి అన్నారు. స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీలో సోమవారం పాఠశాల విద్యార్థులు, మహిళా సభ్యులు, ఉపాధ్యాయులతో మారథాన్ వాక్ నిర్వహించారు. ఆరోగ్య సూత్రాలతో కూడి ప్లకార్డులు ప్రదర్శించారు. విజయలక్ష్మి మాట్లాడుతూ నడక పై ప్రజలలో ఆసక్తి పెంచాలని, నడక వల్ల సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని చెప్పారు. ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మేరీ వజ్రమ్మ, కనక దుర్గ, రామలక్ష్మి, ఉదయ్ కుమారి, చంటమ్మ, వాకర్స్ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షంతో అస్తవ్యస్తం


వర్షంలో ప్రయాణం చేస్తున్న ప్రయాణికులు

ఇరగవరం: మండలంలో సోమవారం ఉదయం కురిసిన భారీ వర్షానికి జనజీవనం స్తంభించింది. ఇరగవరం నుంచి తణుకు, పెనుగొండ, ఆలమూరు గ్రామాల్లోకి పలు కాలనీలు, రహదారులు నీట మునిగాయి. మురుగునీరు, వర్షం నీరు రోడ్డుపై చేరడంతో స్థానికులు, ప్రయాణీకులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు. మురుగు నీరు డ్రెయినేజీలు సరిగా లేకపోవడంతో వర్షం నీరు ఎక్కడికక్కడే నిలిచి పోయింది. మురుగు నీరు ప్రవహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

17న తణుకు ఆస్పత్రిలో ప్రత్యేక వైద్య శిబిరం

తణుకు అర్బన్: తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఈనెల 17వ తేదీన స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ మెగా మెడికల్ క్యాంపుతోపాటు రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ టీవీ షణ్ముఖరెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభించే ఈ ప్రత్యేక కార్యక్రమానికి జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణితో పాటు ఎంపీ పాక వెంకట సత్యనారాయణ, ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పాల్గొంటారని వివరించారు. ఈ మెగా వైద్య శిబిరంలో అవసరమైన వైద్య చికిత్సలను తణుకు, పరిసర గ్రామాల వాసులు సద్వినియోగం చేసుకోవాలని, ఆసక్తి ఉన్న వారు స్వచ్ఛందంగా రక్తదానం చేయవచ్చని కోరారు.

స్పందనకు ఐదు వినతులు

తాడేపల్లిగూడెం: మునిసిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఐదు వినతులు అందాయి. పట్టణ ప్రణాళికా విభాగంలో ఒకటి, ఇంజనీరింగ్‌కు రెండు, ప్రజారోగ్యం రెండు కలిపి మొత్తం ఐదు వినతులు వచ్చాయి. కమిషనర్ ఎం.ఏసుబాబు, ఎంఈ వై.వీ.రమణ, ఏసీపీ జి.సీతారాం, మేనేజర్ రవిసుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మన డబ్బులు - మన లెక్కలపై అవగాహన ర్యాలీ


అప్పారావుపేట గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని అప్పారావుపేట గ్రామంలో మన డబ్బులు - మన లెక్కలు కార్యక్రమంపై సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వెలుగు ఏపీఎం జీవీకేడీఎం.లక్ష్మి మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి, కుటుంబాల ఆర్థిక స్వావలంబన సాధించాలన్నా మహిళలకు మన డబ్బులు మన లెక్కల గురించి పూర్తి అవగాహన అవసరం అన్నారు. గ్రామ సర్పంచ్ ఆరుగొల్లు శ్రీనివాస్ మాట్లాడుతూ మన డబ్బులు- మన లెక్కలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డ్వాక్రా సీసీలు, వీవోఏలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

కౌలు రైతులకు ఏదీ భరోసా!

- కౌలుదారులను పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- అన్నదాత సుఖీభవ అమలులో మొండిచేయి
- గత ప్రభుత్వంలో కౌలుదారునికి పెట్టుబడి సాయం అందజేత


ఇరగవరం వరి పొలంలో పనిచేస్తున్న కౌలు రైతులు

ఇరగవరం: కౌలు రైతులకు ఈ ఏడాది కూడా కూటమి ప్రభుత్వం వెన్నుపోటు పొడిచే విధంగా ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతులను, కౌలుదారులను అన్ని విధాలుగా ఆదుకుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అన్నదాత సుఖీభవ పథకంలో రైతులకు రూ.20వేలు అందిస్తామని ఎన్నికల ముందు కూటమి నేతలు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తరువాత మొదటి ఏడాది రైతులకు మొండి చేయి చూపించారు. రెండవ ఏడాది షరతులతో రైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం వాటా రూ.2వేలు, రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.5వేలు కలిపి రూ.7వేలు ఇచ్చింది. కౌలు రైతులకు మాత్రం నిధులు కేటాయించలేదు. దీంతో కౌలు రైతులు నిరాశ చెందుతున్నారు.

ఎన్నికల్లో ఊదరగొట్టి..గెలిచాక పక్కన పెట్టి

ఎన్నికల ముందు కూటమి పార్టీలు సాధ్యం కాని హామీలతో ఊదరకొట్టాయి. అధికారంలోకి వచ్చాక కౌలు రైతులను పట్టించుకోవడం లేదు. తణుకు నియోజకవర్గంలో దాదాపు 24,293 సీసీఆర్ కార్డులు ఇవ్వాలని లక్ష్యంగా ఉంది. వ్యవసాయ అధికారులు నేటికీ 12,862 కార్డులే మంజూరు చేశారు. దాంతో పాటు రైతులకు ఉచిత పంట బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ ఏడాది పాటు అందలేదు. రైతులకు గత ప్రభుత్వం ఉచిత బీమాను ప్రవేశపెట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉచిత బీమాను రద్దు చేస్తూ రైతులపై ప్రీమియం భారం వేసింది. కౌలు రైతులకు ఏటా అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20వేలు అందిస్తామని హామీ ఇచ్చి..అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా కౌలు రైతులకు మాత్రం మొండి చేయి తప్పడం లేదు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కౌలు రైతులకూ భరోసా..

2019 అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతులతో పాటు కౌలుదారులకు సమానంగా రూ.13,500 మొత్తాన్ని రైతు భరోసా రూపంలో అందజేసింది. రైతులకు అందించే ప్రతి సంక్షేమాన్ని కౌలు రైతులకు వర్తింపజేస్తూ వారిని అన్ని విధాలా ఆదుకుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ ఇవ్వలేదు. పైగా సరైన సమయంలో ఎరువులు, యూరియా లభించకపోవడంతో రైతులు పరిస్థితి దయనీయంగా మారింది. ఈ ఏడాదైనా కౌలు రైతులకు సాయం అందుతుందా అని రైతులు ఎదురు చూస్తున్నారు.

కౌలు రైతులను ఆదుకోవాలి



కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయాలి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కౌలు రైతులకు రూ.13,500 రైతు భరోసా పథకంలో అందజేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం అమలు చేస్తామని చెప్పారు. ఈ ఏడాదిపైగా అయినా కనికరించడం లేదు.

దొంగ శ్రీను, కొత్తపాడు, కౌలు రైతు

రైతుల బాధలు కనిపించవా?



కౌలుదారులు, రైతులు బాధలు కూటమి ప్రభుత్వానికి కనిపించడం లేదు. రైతు తీవ్రంగా నష్టపోతుంటే పాలకులు పట్టించుకోవడం లేదు. ఎన్నికల ముందు సాధ్యం కాని హామీలిచ్చి, అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించారు. కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలి

బళ్ల చిన వీరభద్రం, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి

అర్హులందరికీ సీసీఆర్ కార్డులు



ప్రభుత్వం నుంచి కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందించే విషయంలో ఇంకా ఎలాంటి ఆదేశాలు వెలువడలేదు. ఉన్నతాధికారులు ఉత్తర్వుల మేరకు కౌలు రైతుల ఎంపిక జాబితాను సిద్ధం చేస్తున్నాం. ఈ-క్రాఫ్ నమోదు ప్రక్రియ పూర్తి చేస్తున్నారు. దరఖాస్తు చేసుకున్న అర్హులైన కౌలుదారులకు సీసీఆర్ కార్డులను మంజూరు చేస్తున్నాం.

వై.రాఘవేంద్రరావు, ఇరగవరం మండల వ్యవసాయాధికారి

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి


అంగన్‌వాడీ సమావేశంలో మహిళా నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీలు అమలు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా మహాసభ సోమవారం స్థానిక కిరాణా వర్తక సంఘ భవనంలో ఝాన్సీ లక్ష్మి, రాణి, ప్రసన్న కుమారి, మహాలక్ష్మి, అన్నపూర్ణలు ఆధ్వర్యంలో జరిగింది. మూడు సంవత్సరాలు కార్యకలాపాలు రిపోర్టును యూనియన్ కార్యదర్శి కళ్యాణి ప్రవేశపెట్టారు. అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.కృష్ణవేణి, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.కల్యాణి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజా రామోహన్‌రాయ్, జిల్లా ఉపాధ్యక్షుడు బి.వాసుదేవరావు, జిల్లా సహాయ కార్యదర్శి కర్రి నాగేశ్వరరావులు మాట్లాడుతూ అంగన్‌వాడీ బతుకులను ప్రస్తుత ప్రభుత్వం మార్చాలన్నారు. కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, గ్రాట్యూటీ ఇవ్వాలని, గౌరవ వేతనం ఇవ్వడంతో పాటు ప్రభుత్వ సంక్షేమాలు అమలు చేయాలన్నారు. అంగన్‌వాడీ సమస్యలను పరిష్కారం చేయకపోతే రానున్న రోజుల్లో ఉద్యమాలు చేపడతామని చెప్పారు. పట్టణ నాయకులు జవ్వాది శ్రీను, కరెడ్ల రామకృష్ణ, లక్ష్మి, అజయ్‌కుమారి, పూర్ణ, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

సమాజ అభివృద్ధిలో ఇంజనీర్స్ పాత్ర కీలకం


తణుకులో ఇంజనీర్స్ సత్కారసభలో ఎమ్మెల్సీ రవీంద్రనాథ్


ఇంజనీర్స్ డే వేడుకలు

తణుకు అర్బన్: సమాజ అభివృద్ధిలో ఇంజనీర్స్ పాత్ర ఎంతో కీలకమని వారి నూతన ఆలోచనలు ఎంతగానో ఉపయోగపడతాయని శాసన మండలి సభ్యులు వంకా రవీంద్రనాథ్ అన్నారు. ఇంజనీర్స్ డే సందర్భంగా సోమవారం పైడిపర్రు - తేతలి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంజనీరింగ్ విభాగంలో మోక్షగుండం విశ్వేశ్వరరావు చేసిన కృషిని కొనియాడారు. ముఖ్యంగా బ్లాక్ సిస్టమ్ కనుగొని, గ్రామాల్లో నీటి పారుదల వ్యవస్థను విస్తరించేలా చేశారని, అనేక ప్రాజెక్టులను విజయవంతంగా రూపకల్పన చేశారని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఇంజనీర్స్ అగస్టీన్, రామకృష్ణ, శ్రీనివాసరావు , మాదిరెడ్డి బాబూజీరావులను ఘనంగా సత్కరించారు. కంబాల రంగారావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా సర్వీస్ కోఆర్డినేటర్, తణుకు మాజీ మునిసిపల్ చైర్‌పర్సన్ వంక రాజకుమారి, జోన్ చైర్మెన్ మాదిరెడ్డి కృష్ణకుమారి, వంటెద్దు సోమ సుందరరావు, కుదాది సజని, డాక్టర్ ఆనంద్, వంటెద్దు వాణి తదితరులు పాల్గొన్నారు.

డైమండ్స్ ఆధ్వర్యంలో ఇంజినీర్స్ డే వేడుకలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక డైమండ్స్ ఆధ్వర్యంలో పేరిచర్ల ఫౌండేషన్ చైర్మన్ మురళీకృష్ణంరాజు పర్యవేక్షణలో ఇంజినీర్స్ డే వేడుకలు సోమవారం స్థానిక అర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో ఘనంగా జరిగాయి. సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఇంజనీర్‌గా చేసిన కృషిని పలువురు వక్తలు కొనియాడారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాటన్ దొర, వీణం వీరన్నల సేవలను స్మరించారు. ఇంజనీర్లు కె.మణికుమార్, డి.రవిబాబు, ఎంఈ వెంకట రమణ తదితరులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాళ్ల గోపికృష్ణ, కోటి విజయ కిషోర్, సత్తిబాబు, పుత్రయ్య, కె.శ్రీనివాస్, మృత్యుంజయ కుమార్, యర్రా ఆంజనేయస్వామి, కార్తీక్ ధర్మాతేజ, వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

ఇంకా కొనసాగుతున్న హైడ్రామా

మంత్రి పేషీలో వీసీ ఫైల్


ఉద్యాన వర్సిటీ పాలక భవనం (ఫైల్)

తాడేపల్లిగూడెం: డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి నియామకం, ఎంపిక విషయంలో ఇంకా హైడ్రామా కొనసాగుతుంది. వీసీ కుర్చీ ఖాళీగా ఉందా. ఇప్పటి వరకు ఉన్న వీసీగా ఉన్న వ్యక్తి కార్యాలయానికి వచ్చి వ్యవహారాలు సాగిస్తున్నారా అనే విషయాన్ని వీసీ తర్వాత బాధ్యతాయుత ఉద్యోగంలో ఉన్న రిజిస్ట్రార్ గుంభనంగా ఉంచుతున్నారు. మీడియా ఫోన్ చేస్తే చాలా సందర్భాల్లో స్పందన కరువే. దీంతో ఉద్యాన వర్సిటీలో ఏం జరుగుతుందో బయట ప్రపంచానికి బాధ్యుల ద్వారా తెలియడం లేదు. ఆగస్టు 31 వరకు తాత్కాలిక వీసీగా పనిచేసిన కె.గోపాల్ సూపర్ రెన్యూయేషన్ పద్ధతిలో తన వయస్సు 65 సంవత్సరాల వయస్సు వచ్చే వరకు వీసీగా కొనసాగించాలని హైకోర్టులో రిట్‌పిటిషన్ వేశారు. ప్రతివాదులుగా రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ప్రిన్సిపల్ సెక్రటరీ టు వ్యవసాయ, సహకారశాఖ, ఉద్యానవర్సిటీ రిజిస్ట్రార్‌ను చేర్చారు. రాజ్యాంగంలో ఆర్టికల్ 226 ఆధారంగా తన పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకోవాలని పిటిషనర్ కోరారు. ఇంటీరియమ్ ఆదేశాలు పిటిషనర్‌కు అనుకూలంగా ఉన్నట్టుగా పిటిషనర్ భావించడంతో , తన ఉద్యోగ కాలం పెరిగినట్టుగా అనుకున్నట్టు సమాచారం. ఈ రిట్ పిటిషన్ విషయంలో ప్రభుత్వం తరపు న్యాయవాదులు సూపర్ రెన్యూయేషన్ ఉద్యానవర్సిటీ వీసీ విషయంలో వర్తించదని, రాజ్యాంగంలోని 14,16 అధికరణలకు విరుద్ధమని వాదించారు. అంతే కాకుండా వయస్సు పెంపునకు సంబంధించి 2023లో దాఖలైన రెండు రిట్ పిటిషన్ల గురించి ఉదాహరించారు. కోర్టు రీకాల్ ఇచ్చింది. దీంతో ఉద్యానవర్సిటీ వీసీ పరిస్థితి కోర్టు రీకాల్ , మంత్రి పేషీలో ఫైల్ అన్నట్టుగా ఉంది.

పాడి పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయించాలి


ఆరుగొలను గ్రామంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ సునీల్ కుమార్

తాడేపల్లిగూడెం రూరల్: పాడి పశువులకు క్రమం తప్పకుండా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని ఆరుగొలను పశువైద్యశాలలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సునీల్ కుమార్ మాట్లాడుతూ రైతులు తమ పాడి పశువులకు పాముల నివారణ మందు వేయించాలన్నారు. పెద్ద పశువులకు బిళ్లల రూపంలో మేతలో అందిస్తే పాములను నివారించవచ్చన్నారు. దూడ పుట్టిన 15 రోజులకు పాముల మందు వేయాలన్నారు. వెల్లుల్లి, కుంకుడు కాయ కలిపిన మిశ్రమాన్ని గోమారులు పట్టిన పశువులకు రాస్తే వాటిని నివారించవచ్చన్నారు. సొసైటీ చైర్‌పర్సన్ ఉప్పలపాటి వీరవెంకట సత్యనారాయణ, పాడి రైతులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్‌కు విశిష్ట ఇంజనీర్ అవార్డు


శ్రీనివాస నరేష్‌ను సత్కరిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం : పెదతాడేపల్లి వాసవీ ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ వి.శ్రీనివాస నరేష్ ది ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ (ఇండియా) ఆంధ్రప్రదేశ్ స్టేట్ సెంటర్ గౌరవ ఇంజనీర్ (అకడమిక్స్) అవార్డు 2025 వచ్చినట్టు కళాశాల పాలకవర్గ అధ్యక్ష కార్యదర్శులు గ్రంధి సత్యనారాయణ, చలంచర్ల సుబ్బారావు సోమవారం తెలిపారు. విజయవాడలోని కృష్ణా విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఉపకులపతి డాక్టర్ రాంజీ, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును అందుకున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



తణుకు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

తణుకు అర్బన్: తమ సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు పీఎన్‌వీ ప్రసాదరావు, జిల్లా కార్యదర్శి వేంద్ర రామమోహన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ నిరసన వారంలో భాగంగా సోమవారం తణుకు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు కావస్తున్నా ఉపాధ్యాయ, పెన్షనర్స్‌కు సంబంధించి ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదని, ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను అమలు చేయాలని, బోధనేతర పనులు రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల ప్రకారం సీపీఎస్ రద్దుచేయాలని, మెమో నంబరు 57ను అమలుచేయాలని, మునిసిపల్ ఉపాధ్యాయులకు జీపీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు పి.జనార్ధనస్వామి, కె.రాంబాబు, ఎస్.జాన్సన్, పి.పోతరాజు, సీహెచ్ సత్యనారాయణ, సీహెచ్ నరేంద్ర, కె.అంజిబాబు, వై.ఏడుకొండలు పాల్గొన్నారు.

ప్రమాదపు అంచుల్లో యనమదుర్రు


మీనవిల్లూరు ఉధృతం ప్రవహిస్తున్న యనమదుర్రు డ్రెయిన్

పెంటపాడు: గత రెండు రోజులు నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల యనమదుర్రు డ్రెయిన్ ఉధృతిగా ప్రవహిస్తోంది. ప్రధానంగా మండలంలో బి. కొండేపాడు, మీనవిల్లూరు గ్రామాల్లో ఈ ప్రభావం అధికారంగా ఉంది. ఈ ప్రాంతాలలో ఏటిగట్లు బలహీనంగా ఉన్న ప్రాంతాలలో గండ్లు పడే అవకాశం ఉంది. తక్షణం రెవెన్యూ అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

తగ్గిన ఎర్ర కాలువ వరద నీటి మట్టం

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం మండలం మాధవరం వద్ద ఎర్ర కాలువ నీటి మట్టం తగ్గింది. నందమూరు అక్విడెక్ట్ వద్ద ఆదివారం 28.9 అడుగులుగా ఉంది. సోమవారం సాయంత్రానికి 25 అడుగులుకు చేరినట్లు తహశీల్దార్ ఎం.సునీల్ కుమార్ తెలిపారు. కాగా, మాధవరం - కంసాలిపాలెం కాజ్‌వే వద్ద అడుగు మేర నీటి మట్టం తగ్గిందన్నారు. మాధవరం - నిడదవోలు మధ్య రాకపోకలు నిలుపుదల చేస్తూ బ్యానర్లు ఏర్పాటు చేశామని, ఈ విషయాన్ని వాహనదారులు, రెండు ప్రాంతాల ప్రజలు గుర్తించాలన్నారు. అలాగే, రెవెన్యూ సిబ్బందిని ఎర్ర కాలువ వద్ద ఏర్పాటు చేశామన్నారు. ఎగువ నుంచి నీటి విడుదలను నిలుపుదల చేయడంతో ఎటువంటి ప్రమాదం లేదన్నారు.

క్రమబద్ధీకరణతో అన్ని అనుమతులు


సమావేశంలో మాట్లాడుతున్న ఏలూరు అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ ప్లానింగ్ అధికారి సుధాకర్

తాడేపల్లిగూడెం రూరల్: గ్రామాల్లో నాన్ లే అవుట్, బిల్డింగ్, లే అవుట్ల క్రమబద్ధీకరణతో అన్ని రకాల అనుమతులు లభిస్తాయని ఏలూరు అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ ప్లానింగ్ ఆఫీసర్ వి.సుధాకర్ సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో తాడేపల్లిగూడెం, పెంటపాడు, ఇరగవరం, అత్తిలి, గణపవరం, తణుకు మండలాలకు చెందిన ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులకు లే అవుట్ల రెగ్యులరైజేషన్ స్కీమ్(ఎల్ఆర్ఎస్) పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ 2025 జూన్ 30వ తేది లోపు ఇళ్ల స్థలం, బిల్డింగ్ కొనుగోలు చేసిన వారికి ఈ పథకం వర్తిస్తుందన్నారు. క్రమబద్ధీకరించుకున్న నాన్ లే అవుట్లు, బిల్డింగ్‌లకు బ్యాంకులు రుణ సదుపాయం కల్పిస్తాయన్నారు. నోటిఫికేషన్ జారీ చేసిన 90 రోజుల్లోపు రెగ్యులరైజేషన్ చేసుకున్న వారికి రాయితీలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. 45 రోజుల లోపు వారికి 10 శాతం, 46 నుంచి 90 రోజుల లోపు వారికి ఐదు శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

వడ్డి రఘురామ్‌కు అభినందనలు


వడ్డి రఘురామ్‌కు అభినందనలు చెబుతున్న రెడ్డి సంఘం నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆక్వా కల్చర్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వడ్డి రఘురామ్ బాధ్యతలను స్వీకరించిన సందర్భంగా సోమవారం పెంటపాడు మండలానికి చెందిన రెడ్డి సంఘం నాయకులు శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. నాయకులు రెడ్డిబాబు, కర్రి శ్రీనివాస్ రెడ్డి, పోతంశెట్టి లక్ష్మి, కర్రి సురేష్ రెడ్డి, సతీష్ రెడ్డి, సింగారెడ్డి లక్ష్మీనారాయణ రెడ్డి, గొలుగూరి శేషారెడ్డి, వెలగల లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.